ఊరూరా మేడే సంబరాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో కార్మిక నాయకులు ఎర్ర జెండాను ఎగురవేసి ర్యాలీ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్, టాక్సీ వర్కర్స్ యూనియన్, ఆటో మోటార్స్ యూనియన్, వివిధ కార్మిక సంఘాల నేతలు మే డే సంబరాలు చేసుకున్నారు.

విమానాశ్రయంలో...

రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం ఓల్డ్ టెర్మినల్ మెయిన్ గేటు వద్ద ఎయిర్‌పోర్టు ప్రీపెయిడ్ టాక్సీ నాయకులు మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా విమానాశ్రయ డైరెక్టర్ భూమి నాథన్ పాల్గొని కార్మికుల జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు సీఐఎస్ఎఫ్ కమెండో బహదూర్, సి.ఎస్.ఓ రాజేంద్ర ప్రసాద్, కమర్షియల్ డిపార్టుమెంట్ మేనేజర్ కచప్, యూనియన్ నేతలు షఫీ, రిజ్వాన్, సైఫుల్లా, షబ్బీర్, షరీఫ్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గురువారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవం జరుపుకున్నారు. బుచ్చినాయుడుకండ్రిగలో సీపీఐ మండల కార్యదర్శి కత్తిధర్మయ్య, సీపీఎం మండల నాయకులు రమణయ్య ఆధ్వర్యంలోపార్టీ జెండాలను ఎగురవేశారు.



శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మేడే వేడుకల్లో అంజూరు తారక శ్రీనివాసులు

కార్మికులు ఏకం కావాలి

ఏర్పేడు (రేణిగుంట): తమ హక్కుల సాధనకు కార్మికులు ఏకం కావాలని అన్నారు. ఏర్పేడు మండలం ఏర్పేడు, పాపానాయుడుపేటలలో సీఐటీయూ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పాపానాయుడుపేట మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం మొదలి, సీఐటీయూ మండల కార్యదర్శి కరీముల్లా , నాయకులు , బిల్డింగ్ వర్కర్స్ నాయకులు , ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మండలంలో..

శ్రీకాళహస్తి మండలం అమ్మపాలెంలో పలు కార్మిక, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఐ నాయకులు మించల శివకుమార్ , ఎల్లమ్మ, సుజాత, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేడుకలు

రేణిగుంట: శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆటో యూనియన్ అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో గురువారం కార్మిక దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొని ఆటో కార్మికులతో కలసి కేక్‌ను కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పేద, బడుగు, కార్మిక వర్గానికి గత పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అందించి, ఆసరాగా నిలిచారన్నారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.10 వేలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్న రాయల్, శ్రీవారి సురేష్, ఉత్తరాది శరవణ కుమార్, పఠాన్ ఫరీద్, ఫజల్, కామి వెంకటేశ్వర్లు, వేలూరు రమేష్, అస్లాం, జుమ్లేషా, గౌస్ బాషా, నారాయణ, మునిరెడ్డి, షబ్బీర్, ఉస్మాన్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రేణిగుంట: కార్మికలోకం ఐక్యంగా పోరాటాలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య అన్నారు. శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ యూనియన్ ఆటో అంబులెన్స్ యూనియన్, మున్సిపల్ యూనియన్, సివిల్ సప్లై గోడౌన్ యూనియన్, ఊరందూరు ఆటో స్టాండ్, విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ కార్యదర్శి గోపి, ఏఐటీయూసీ అధ్యక్షుడు మురళి, ప్రజానాట్య మండలి నియోజకవర్గం అధ్యక్షుడు చారుశీల, ప్రజానాట్యమండలి నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మునిచందు, అయ్యప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ జెండాను ఎగురవేశారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద పార్టీ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి చిన్నిరాజ్ స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు ధనంజయులు, శాంతి, గౌరి, నిర్మల, మల్లికార్జున, రాము, సీపీఐ నాయకులు బుర్రా చంద్రశేఖర్, చంద్ర, తరుణ్‌కుమార్, వాణిశ్రీ, కృష్ణమూర్తి, మురళి పాల్గొన్నారు.



ఏర్పేడు మండలంలో..



వరదయ్యపాళెంలో..



రేణిగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు



రేణిగుంట విమానాశ్రయం వద్ద వేడుకల్లో నేతలు



శ్రీకాళహస్తి: విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సంబరాలు

క్లుప్తంగా

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రాకేష్

వరదయ్యపాళెం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం తిరుపతి, చిత్తూరు జిల్లాల సోషల్ మీడియా అధ్యక్షుడు వేలూరు రాకేష్ కలిశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఆయన సూచించినట్లు రాకేష్ తెలిపారు.

మాలల ఆత్మీయ గౌరవ సభను విజయవంతం చేయండి

ఏర్పేడు(రేణిగుంట): ఈనెల 11వ తేదీన తిరుపతిలో జరగనున్న మాలల ఆత్మీయ గౌరవ సభను విజయవంతం చేయాలని కార్యక్రమ కన్వీనర్ మల్లారపు మధు కోరారు. మండలంలోని జీపాలెం గ్రామంలో అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్టార్ కృష్ణను ఆయన నివాసంలో కలసి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కన్వీనర్ మల్లారపు మధు మాట్లాడుతూ.. తిరుపతిలో నిర్వహించే మాలల ఆత్మీయ గౌరవ సభను విజయవంతం చేయడంలో తమకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో భారత్,రాజా, విష్ణు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంజూరు గ్రామ సర్పంచ్‌కు మాతృ వియోగం



అంజూరులో పార్వతమ్మ మృత దేహానికి నివాళి అర్పిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: కేవీబీపురం మండలం అంజూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అత్తిరాల సురేష్ తల్లి పార్వతమ్మ గురువారం మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పార్టీ శ్రేణులతో కలిసి పార్వతమ్మ మృత దేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, నంద కుమార్, వైస్ ఎంపీపీ శ్రీను, సీనియర్ నాయకులు లాల్‌బాబు యాదవ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణలో మెలకువలు నేర్చుకోవాలి



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సత్యవేడు: మహిళలు కుట్టు మిషన్ శిక్షణలో మెలకువలు నేర్చుకుని చేతి వృత్తుల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. సత్యవేడు ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన కుట్టు శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా కోఆర్డినేటర్ పద్మ మాట్లాడుతూ.. రెండు బ్యాచ్‌లలో 140 మందికి మూడు నెలలు కుట్టు మిషన్ శిక్షణ ఇస్తామన్నారు. రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఎం డాక్టర్ డాంగేయాదవ్, ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, వికేఎస్ పరమశివం (బాషా), చికెన్ చిన్నా (మురళి) బాల మురళికృష్ణ, సుగుణ, పాల్గొన్నారు.

తాత్వికవేత్త రామానుజులు



హరికథ గానం చేస్తున్న వెంకటేశ్వర్లు

తిరుపతి కల్చరల్: శ్రీవైష్ణవాన్ని, అష్టాక్షరి మంత్రంలోని అర్థాన్ని, సామాన్యులకు మోక్ష మార్గాన్ని ఉపదేశించి ఈ సహస్రాబ్దిలోనే గొప్ప తాత్వికవేత్తగా, సామాజిక సంస్కర్తగా రామానుజాచార్యులు నిలిచిపోయారని డాక్టర్ కేటీవీ రాఘవన్ ఉద్ఘాటించారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో చేపట్టిన రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు గురువారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకుడు వెంకటేశ్వర్లు ప్రదర్శించిన హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ప్రోగ్రాం అధికారి పురుషోత్తం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రప్రభపై అగస్తీశ్వర స్వామి



చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న అగస్తీశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలోని మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామి వారు అమ్మవారితో చంద్రప్రభ వాహనంపై సముదాయం గ్రామ వీధుల్లో విహరించారు. 11.30 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించారు. టీటీడీ ఏఈఓ రవి, ఆలయ అధికారి నాగరాజు, భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, గౌతమ్ గురుకళ్ పర్యవేక్షించారు.



ధ్వజ స్తంభం వద్ద అర్చకుల పూజలు

- రెండో రోజు శుక్రవారం సాయంత్రం అగస్తీశ్వర స్వామి సింహ వాహనంపై ఊరేగనున్నారు.

పెన్షన్ మార్చ్ పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా మూడన్నర లక్షలకుపైగా ఉన్న సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్ మార్చ్ నిర్వహించనున్నట్లు ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పెన్షన్ మార్చ్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు యాదవ్, సహాధ్యక్షుడు చీర్ల కిరణ్, రామనరసింహ, మహిళా అధ్యక్షురాలు రేఖ, జిల్లా అధ్యక్షుడు వంకీపురం పవన్ పాల్గొన్నారు.

పోలీసుల పల్లెనిద్ర



గ్రామంలోని పిల్లలతో సీఐ జయచంద్ర

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలతో రేణిగుంట పోలీసులు మమేకమయ్యారు. పల్లెనిద్రలో భాగంగా గురువారం రాత్రి కరకంబాడి పంచాయతీ గుండ్రాల కాలవ గ్రామంలోని ప్రజలతో అర్బన్ సీఐ జయచంద్ర సమావేశం అయ్యారు. గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పిల్లలకు నోట్ పుస్తకాలు , పెన్నులు పంపిణీ చేశారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించండి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి అర్బన్: తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ జీ.రాధ బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ క్రమంలో ఆయన మెడికల్ కళాశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచనలు చేశారు. చిన్న సమస్య అయినా వెంటనే అందుకు పరిష్కారం చూపించే దిశగా కృషి చేయాలని స్పష్టం చేశారు. ఆమెతో పాటు పలువురు వైద్యులు ఉన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర





నడివీధిలో కొలువైన గంగమ్మ తల్లి, కల్లు దుత్తలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గాజుల మండ్యంలోని నడివీధి గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. బుధవారం అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి గురువారం తెల్లవారుజామున నడి వీధిలో కొలువు తీర్చారు. నడివీధిలో కొలువుతీరిన గంగమ్మ తల్లికి భక్తులు దూప దీప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. 1000 కల్లు దుత్తలను తీసుకొని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారికి కుంభం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ధ్యానంతో మానసికోల్లాసం



ధ్యానంపై శిక్షణ ఇచ్చిన గురువులను సత్కరిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

తిరుపతి రూరల్: మారుతున్న కాలానికి తగ్గట్టుగా మనిషి జీవితం ఉరకలు, పరుగులు మధ్య సాగుతోందని, మానసిక ప్రశాంతత లేకుండా జీవనం సాగిస్తుండడంతో అనేక రోగాల బారిన పడుతున్నట్లు స్విమ్స్ ఆస్పత్రి మాజీ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లిలో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరఫున శ్రీలక్ష్మీ నరసింహ స్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ద్వారా 41 రోజుల పాటు యోగా, ధ్యానంపై శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం యోగా, ధ్యానం శిక్షకులతో పాటు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. అనంతరం ధ్యాన శిక్షకులుగా వచ్చిన రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రతాప్ హరినాథ్ బాబు, జయరాంరెడ్డి, లక్ష్మి ప్రసన్న, సునీత ధ్యానం వల్ల వారికి కలిగిన లాభాలను వివరిస్తూ తమ అనుభవాలను తెలియపరిచారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు రామ్మూర్తి రెడ్డి, కుమార్ స్వామిరెడ్డి, తిరుమలరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

పంట మార్పిడితో ఆదాయం

- తెగుళ్ల నివారణ
- అధిక దిగుబడులకు అవకాశం
- ఒకే పంటతో చీడపీడలు అధికం

సత్యవేడు: ఏటా పంట మార్పిడితో రైతులకు అధిక ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఏటా ఒకే పంట సాగు చేస్తే రైతులకు పెట్టుబడులు పెరుగుతాయని, అంతే గాక పంటపై తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. ఏటా పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఒకే రకం పంటను ఏళ్ల తరబడి సాగు చేయడంతో పంటల ఎదుగుదల తగ్గుతుందని, చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందని వెల్లడిస్తున్నారు.

వేర్వేరు పంటల సాగు

పొలంలో ఒకే రకం కాకుండా వేర్వేరు పంటలను సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా లాభం పొందవచ్చని వ్యవసాయాధికారులు సలహాలు ఇస్తున్నారు. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడి ఆవశ్యకత, ప్రయోజనాలు వివరిస్తున్నారు.

ఒకే తరహా పంటలతో నష్టాలు

ఏటా ఒకే తరహా పంట సాగు చేయడం వల్ల చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయి. కలుపు బెడద అధికంగా ఉంటుంది. సాగు చేసిన పైరు ఎదుగుదల ఉండదు. తద్వారా దిగుబడులు తగ్గుతాయి. దీంతో రైతులకు పెట్టుబడి భారం పెరిగి నష్టం వాటిల్లుతుంది.

- ఒకే పంట సాగుతో వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యత ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం కలుగుతుంది. మార్కెట్ సమస్యలు ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగు చేసుకోవాలి.



సత్యవేడు మండలంలో పొలం దున్నుతున్న రైతు

- ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. ఉదాహరణకు జొన్న, పత్తి.
- భూసారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవాలి.
- వరిపంట సాగు చేస్తే ముందు పచ్చిరొట్టి పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. అంతే గాక సేంద్రియ పదార్థ భూమిలో ఎక్కువగా చేరుతుంది.
- వరి తర్వాత అపరాలు వంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం అధికమవుతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంద్రాలు వృద్ధి తగ్గుతుంది.
- వరి తర్వాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, వేరుశెనగ వంటివి సాగు చేయడం వల్ల వాటి వేళ్లలోని రైజోబియ్యం బ్యాక్టీరియాను గాలిలోని నత్రజని తీసుకుంటుంది.వేర్లలో బుడిపెలు మాదిరిగా ఏర్పడిన తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి

మంచి దిగుబడులకు అవకాశం

పంట మార్పిడి వల్ల రైతులు అధిక దిగుబడి సాధించవచ్చు. ప్రస్తుతం రైతులు అధిక శాతం తమ పొలాల్లో ఏటా ఒకే రకం పంట సాగు చేస్తున్నారు. నీటి పారుదల కింద వరి తప్ప ఇతర పంటలు సాగు చేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించేందుకు పంట మార్పిడి విధానం ఉత్తమమైంది.

– మురళి, ఏఓ, సత్యవేడు మండలం

హైవేలో వెలగని లైట్లు



రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి– చెన్నై ప్రధాన రహదారి కేఎల్ఎం హాస్పిటల్ కూడలి నుంచి పుత్తూరుకు వెళ్లే వైపు హైవేలో ఉన్న లైట్లు కొన్ని రోజులుగా వెలగడం లేదు. ప్రధాన రహదారిలో చిమ్మ చీకటి అలముకొంది. హైవేకు రెండు వైపులా గ్రామాలు ఉన్నాయి. గ్రామస్తులు రోడ్డు దాటాలి అంటే చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. నేషనల్ హైవే అధికారులు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు.